# భామామణుల భీమా వెఱ్ఱి

గరిమెళ్ల సత్యనారాయణగారు, బి. ఎ.

"క్షణంచిత్తం క్షణంవిత్తం క్షణంజీవిత మాయుర్లోః." విత్తమునకుగాని ప్రాణము నకుగాని యెప్పు డెట్లు నాశనము వచ్చునో చెప్పజాలము. ముందు అపాయము రావచ్చు నని నిశ్చయించుకొని కాస్తపచ్చగానుబలము గాను ఉన్నప్పుడే మనము చనిపోయినచో మన తరువాతివారికిగాని బ్రతికియున్నచో ముసలితనములోగాని, నష్టము వచ్చినచో పూర్తిచేసుకొనుటకుగాని కొంతధనమును ప్రత్యేకించి దాచుకొనుట వివేకపథము. ఇట్లు చేసుకొనుచున్నను ఈకీడులు మార్గమధ్యము ననే మూడినప్పు డిట్టిమనకు ఇతరులు సాయము చేయుటయు, ఇట్టి యితరులకు మనము సాయముచేయుటయు లోకధర్మము. దీనినే భీమావ్యాపారసరణియందురు. ఇది పాశ్చాత్యదేశములలో బాగా వ్యాపించినది. మనదేశములో ఇంకాప్రారంభావస్థలోనే యున్నది. ఇంకను ఎంతయో విస్తరించవలసిన ఆవశ్యకత కలదు. ఇది మానవజీవితమునకు, మోటారులకు, అగ్నిప్రమాదముల వలన నష్టమురాకుండా వర్తకపుదినుసులకు, పడవలకు అనేకములకు చేసుకొనవచ్చును; చేసుకొనుచున్నారు. కాని పాశ్చాత్యస్త్రీ పురుషులు ధనసౌందర్యపిపాసాయత్తచిత్తులు, సినీమానటీనటులు మొదలగువారు చేయించుకొనుచున్న భీమాలు మిక్కిలి వేలమువెఱ్ఱిగా నున్నవి. వానిలో కొన్నిటి నీదిగువను "ఇండియను పాలసీహోల్డర్సు" అను పత్రికనుండి తీసి యెత్తి వ్రాయుచున్నాను:

కన్నుదగ్గఱిపన్నుకు భీమా:—మిసు డోరెను అటకు అనుపేరు గల పదునైదేండ్ల బాలిక చక్కగా యీలకొట్టగలదు. కన్నుదగ్గరనుండు పన్ను బాగుండనిదే యిట్లు చేయుట చాలకష్టము. ఈవృత్తివలన యీమె నాటకరంగముమీద నెలకు రు2,400/లు సంపాదించుచున్నది. ఈపన్నుకు ప్రమాదమువచ్చినయెడల నష్టము నుండి కాపాడుకొనుటకు దీనినామె రు 22,500లకు భీమా చేయించుకొన్నది.

వీపుపైపున నంసములకు భీమా:—లీలుడాగోవరు అనుకన్య కీభాగము మిగుల అందముగ నుండును. అయిరోపాఖండమున నింతచక్కనియంసభాగ మింకొక తెకు లేదట. ఈమె సినీమానటి. ఇందువలన నీమె మిక్కిలి రొక్కము నార్జించుచున్నది. దీని నీమె అత్యధికమైన మొత్తమునకు భీమాచేయించుకొన్నది.

పెదవులకు భీమా:—ఒక జపానుకన్య యొక్క పెదవులు గులాబిరంగుచే ప్రకాశించుచు మిగులవన్నె కెక్కినవి. ఆయంద మెప్పుడు మందమగునో యని ఆమె రు. 15,000లకు భీమాచేయించుకొన్నది.

చెక్కిళ్ల మీద సుడులకుభీమా:—అమెరికాలో ఫిలుములను తయారుచేయు ఒక సాహుకారు తనకొలువులోనుండి తాను మోహించిన యొక యువతియొక్క చెక్కిళ్ల సుళ్లయొక్క అందము మాసినచో తాను జీవించుటయే దుర్భరమని తలచి ఆసుళ్లను

రు. 3,00,000లకు భీమాచేయించెను. కాని వారి వివాహమైన అనతికాలములోనే వారు విడాకులిచ్చుకొనిరి. కనుక భీమా రద్దయినది.

కేశపాశమునకు భీమా:—మిస్ లూసీ కేటను అను పేరు గల ఇరువదిరెండేండ్ల యువతికి లోచనమోహనంబులైన బంగరువన్నె కురులున్నవి. ఆమెది దుస్తులు కుట్టువృత్తి. లండను ప్యారిసునగరములందలి విలాసపురుషులును స్త్రీలును ఆమెకురులను మెచ్చియే ఆమెచే తమ దుస్తులను కుట్టించుకొందురు. ఏదుర్గతివలనకాని అవి వర్ణము చెడినచో వారందఱును తనవద్దకురారని భయపడి ఆమె తనకురులను రు. 15,000లకు భీమా చేయించుకొనినది.

అందము కలుగకుండా భీమా:- "నాట్యరంగమున నాడు నటీ మణులలో కెల్ల కురూపి "పోలేరు" అనుకన్య. ఈ కురూపితనము వలన నామె లెస్సగా ధనమును సంపాదించుచున్నది. కర్మముచాలక ఆమెకెక్కడనైన నంద మంటుకొన్నచోట ఈరాబడికి స్వస్తిచెప్పి చెడిపోవలసి వచ్చునని ఆమె తనకు సొగసు కలుగకుండా పెద్ద మొత్తమునకు భీమా చేయించుకొన్నది.

ఆఘ్రాణశక్తికి భీమా:— ప్యారిసులో ఒక యువతి వాసన పదార్థములను చక్కగ కనిపెట్టగలదు. సకలవాసనలను చెప్పగలదు. ఇందువలన నామె అమితమగు ధనమార్జించుచున్నది. దీని నామె పెద్దమొత్తమునకు భీమా చేయించుకొన్నది.

కవలపిల్లలకు భీమా:—అనేకస్త్రీలు ఇద్దరుముగ్గురేసిపిల్లలొకేసారి పుట్టకుండా భీమా చేయించుకొనుచున్నారు.

విడాకులురాకుండాభీమా:— అనేకస్త్రీలు తాము పెండ్లాడినట్టియు పెండ్లాడబోవునట్టియు భర్తలకును తమకును వివాహవిచ్ఛేదములుకలుగకుండా భీమాలుచేయించుకుంటామంటున్నారు. కాని ఏకంపెనీవారికిని ఇంతటిసాహసము కలుగకుండుటచే ఇట్టి భీమాలు జరుగకున్నవి.

కళ్లకుభీమా:—మిసుజీనుకోవిను అను ఒకనటి డాలీథియేటరు అనుకంపెనీలో వేషములువేసి ధనముసంపాదించును. ఆమెకళ్లు త్రిప్పుటపు చమత్కృతివల్లనే ఆమెకంత ధనము కలుగుచున్నది. ఆమెకళ్లను 20,000 పౌనులకు భీమాచేయించుకొన్నది.

ప్రధానపుటుంగరమునకు భీమా:— క్రొత్తగా ఒక విలాసిని తాను ప్రేమించుచున్న ప్రధానపుటుంగర మెక్కడపోవునో అని పెద్ద మొత్తమునకు భీమా చేయించినది.

